తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# గ్రామకంఠం భూమిని పరిశీలించిన జిల్లా శిక్షణ సహాయ కలెక్టర్

## గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి పోలీసు భద్రత కల్పించాలని ఆదేశం



మర్రిగూడ,ఆగష్టు 3 ప్రభాత వార్త:
మర్రిగూడ మండలంలోని ఖుదాబక్షపల్లి గ్రామంలో వివాదానికి కేంద్రంగా మారిన గ్రామకంఠం భూమిని జిల్లా శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి కూడా విచారణలో పాల్గొన్నారు.
గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన స్థల ధ్రువీకరణ పత్రాలపై నకిలీ ఆరోపణలు రావడంతో అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలించి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొనసాగేందుకు తగిన పోలీసు భద్రత కల్పించాలని మర్రిగూడ పోలీసు అధికారికి ఆదేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పందుల విజయలక్ష్మి, మండల అభివృద్ధి అధికారి మున్నయ్య, మండల పంచాయతీ అధికారి రవికుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసన్నబాబు, ఉపసర్పంచ్ ఎస్.కె. షబ్బీర్, గ్రామస్థులు పాల్గొన్నారు.
వివాదానికి గురైన గ్రామ పంచాయతీ పరిధిలోని స్థలం ప్రాథమిక విచారణలో గ్రామకంఠం భూమేనని తేలినట్లు మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, మండల అభివృద్ధి అధికారి మున్నయ్య, మండల పంచాయతీ అధికారి రవికుమార్ వెల్లడించారు. తదుపరి అధికారిక ప్రక్రియను నిబంధనల ప్రకారం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# భీమ్లా తండాలో ఊరంతా సందడి దేవుళ్ళ పండుగ

## -వరుణ దేవుడు కరుణించాలని బొడ్రాయికి అభిషేకాలు

## -ఏడుగురి గ్రామ దేవతలకు నైవేద్యాలు

## బోనాల పండుగలో సాంప్రదాయ దుస్తులతో గిరిజన స్త్రీలు యువకులు







మర్రిగూడ,ఆగష్టు 3 ప్రభాత వార్త:
ప్రకృతి కరుణించాలని, వరుణ దేవుడు శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకుంటూ కమ్మగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని భీమ్లా తండాలో గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో బొడ్డురాయికి, ఊర దేవుళ్లకు నీళ్లు పోశారు.

**ఎల్ నినో ప్రభావంతో కరవు ఛాయలు**

ప్రస్తుత కాలంలో ఎల్ నినో ప్రభావం వల్ల ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, తీవ్రమైన ఎండలు, కరవు పరిస్థితులు నెలకొనడంతో తండావాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం సగం ముగుస్తున్నా ఆశించిన మేర వానలు పడకపోవడంతో వ్యవసాయ పనులు మందగించాయి.

**పంటలు పండాలని**

వర్షాలు సమృద్ధిగా పడి పంటలు పండాలని, తండాలోని ప్రజలంతా ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఊర దేవుళ్లకు బిందెలతో నీళ్లు పోసి శాంతింపజేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, కరవు బారిన పడకుండా కాపాడాలని వరుణ దేవుణ్ణి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కమ్మగూడ సర్పంచ్ విజయ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీ ఆంబోత్ కిషన్ నాయక్, వార్డు సభ్యులు రామావత్ విజయ్, రామావత్ బిక్షం, మాజీ వార్డు సభ్యులు శ్రీను, రామావత్ రమేష్, రామావత్ బిక్షం, రామావత్ సురేందర్, రామావత్ నాగరాజు, రామావత్ గణేష్, రామావత్ రెడ్డి, వడ్త్యా నవీన్, ఆంబోత్ విజయ్, రామావత్ రాజు, రామావత్ నరేష్, నరేందర్, అశోక్, సునీల్, శ్రీధర్, రాంచరణ్, మహేష్, కిట్టు, సోను, వంశీ తదితరులతో పాటు తండా ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు